క్లుప్తంగా

నేటి నుంచి విధుల బహిష్కరణ

తిరుపతి లీగల్: తిరుపతిలో ఈ నెల 2 శనివారం నుంచి 15వ తేదీ వరకు కోర్టు విధులకు హాజరు కాకూడదని న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. శుక్రవారం మధ్యాహ్నం న్యాయవాదుల అసోసియేషన్ హాల్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూ హక్కు చట్టం అమలును నిరసిస్తూ పలువురు న్యాయవాదులు ఈ సమావేశంలో ప్రసంగించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకటకుమార్, బాలచంద్రమౌళి, రామనాథం, పీఎస్ వాసు, ఉపాధ్యక్షుడు గోపిచంద్, బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

చంద్రగిరి ఏఎంసీ చైర్మన్‌గా కొటాల


చంద్రశేఖర్‌రెడ్డి, గోవర్ధన్ గుప్తా

చంద్రగిరి: వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా రామిరెడ్డిపల్లి పంచాయతీ కూచువారిపల్లికి చెందిన కొటాల చంద్రశేఖర్‌రెడ్డిని, వైస్ చైర్మన్‌గా చంద్రగిరి పట్టణానికి చెందిన చేగు గోవర్ధన్ గుప్తాలను నియమించేందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించారు. చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంగా ఓ వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయించిన ఘనత కూడా ఎమ్మెల్యే చెవిరెడ్డికే దక్కుతుంది. యార్డు పరిధిలో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలను కలపడంతోపాటు అక్కడి వారికి కూడా డైరెక్టర్లుగా స్థానం కల్పిస్తూ అందరికీ సముచిత న్యాయం కల్పించారు.

ఓటరు జాబితాపై ప్రత్యేక శిబిరాలు

తిరుపతి తుడా: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కొత్త ఓటర్ల నమోదుకు, సవరణలకు సంబంధించి ఈ నెల 2, 3వ తేదీలలో ప్రత్యేక శిబిరాలను ఆయా పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గం ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 167 తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 267 పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలలో ముసాయిదా ఓటర్ల జాబితాలతో అందుబాటులో ఉంటారని తెలిపారు. తమ పేర్లను జాబితాలో సరిచూసుకోవచ్చునని తెలిపారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం


చంద్రగిరి ఏరియా ఆసుపత్రి నుంచి ర్యాలీ

చంద్రగిరి: సమాజంలో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు అందరూ సహకరించాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాల, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యు, ఆర్‌హెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సర్కిల్ వద్ద విద్యార్థులతో కలసి మానవహారం నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌హెచ్‌యు వద్ద వైద్యాధికారులు ప్రదర్శన చేశారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, శాస్త్రవేత్తలు వెన్నెల సాహితి, ప్రసాద్, మెడికల్ అధికారులు యుగంధర్, మధుసూదన్, వైద్యులు శ్రీలక్ష్మి, రేవతి, కళ్యాణ చక్రవర్తి, శ్రీ వేంకటేశ్వర వైద్యకళాశాల పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

తిరుపతి సిటీ: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రసూతి ఆసుపత్రి విభాగాధిపతి డాక్టర్ ప్రమీల పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా శుక్రవారం ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోం సైన్స్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి ఒక్క విద్యార్థి ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల మైక్రో బయాలజీ డాక్టర్ విజయకుమార్, టెక్నికల్ ఆఫీసర్ బాలాజీ, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం హోమ్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.బిందు, ప్రొఫెసర్ ఎం.అరుణ, డాక్టర్ శిరీష, డాక్టర్ అనిత, యూజీ పీజీ విద్యార్థులు, ఎస్వీ వైద్య కళాశాల పీఆర్‌ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

గడప గడపలోనూ అదే ఆత్మీయత

- పుదిపట్లలో ముగిసిన చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: చరిత్రలో ఎన్నడూ చూడనంత అభివృద్ధి, సంక్షేమ, సేవా కార్యక్రమాల ప్రదాత, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై పుదిపట్ల ప్రజలు తమ ఆత్మీయ అభిమానాన్ని చూపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్రలో పుదిపట్లవాసులు అపూర్వ స్వాగతంతో ఆత్మీయతను చాటుకున్నారు. తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల పంచాయతీలో మూడు రోజులుగా చెవిరెడ్డి లక్ష్మి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేపట్టిన సేవా కార్యక్రమాలు, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తున్నారు. పంచాయతీలో చేసిన అభివృద్ధి, సేవా, సంక్షేమంపై కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. శుక్రవారం సాయంత్రంతో పుదిపట్లలో చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్ర ముగిసింది. శుక్రవారం అరుణ కాలనీ, రజకుల కాలనీ, బ్యాంకు కాలనీల్లో పాదయాత్ర చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారపు శ్రీరాములు, మహేంద్ర, గోపి, బడి వెంకటేష్‌యాదవ్, దిలీప్ చౌదరి, నవీన్, హరీష్, తేజా పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా జగనన్న సంక్షేమ పథకాలు


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ లీలావతి

తిరుపతి మంగళం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చరిత్రలో నిలిచిపోయేలా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని మంగళం రణధీర్‌పురం పంచాయతీ వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళం రణధీర్‌పురం పంచాయతీలో శుక్రవారం ‘ఏపీకి జగనే ఎందుకు కావాలంటే’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జగనన్న అందించిన సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి, అపార్టీ జెండాను ఎగురవేశారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగనన్నకే తామంతా మద్దతుగా ఉంటామని ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిపేదవాడి ముంగిటకే చేరుతున్నాయన్నారు. రాష్ట్రంలో జగనన్న, చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిత్యం ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేనంతగా రణధీర్‌పురం పంచాయతీలో గత నాలుగున్నరేళ్ళల్లో రూ.9 కోట్లతో సీసీ రోడ్లు, మురుగుకాలువలు, సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు తదితర అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. సర్పంచ్ లీలావతి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, అధ్యక్షులు రజాక్, మహ్మద్‌కాసీమ్‌బాషా, వార్డు సభ్యులు మురళి, సతీష్, ధనమ్మ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ ఆధ్వర్యంలో జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం చంద్రగిరి కొత్తపేటలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆర్‌బీఐ ఎల్‌డీఓ మేనేజర్ పూర్ణిమ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలు ఉపయోగించుకొని తద్వారా సైబర్ నేరాలపై జాగ్రత్త వహించాలని సూచించారు.

మృతులకు తుడా చైర్మన్ నివాళి


గోవిందమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

పాకాల: ఆకస్మికంగా మృతి చెందిన ఇద్దరికి తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం సామిరెడ్డిపల్లి గ్రామంలో మృతి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకుడు రఘునాథరెడ్డి మృతి చెందారు. అలాగే డొట్లవారిపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు టి.ఆంజనేయులురెడ్డి భార్య గోవిందమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. మోహిత్‌రెడ్డి వారి నివాసాలకు చేరుకుని మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రతిష్టాత్మకంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- కార్యక్రమాన్ని ప్రారంభించిన తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాకాల సచివాలయ ఆవరణలో సర్పంచ్ ఎస్.కస్తూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని మోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు సమృద్ధిగా అందుతున్నాయని వివరించారు. ఉజ్వల యోజన పథకం ద్వారా పలువురు లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అధికారులు అవగాహన కల్పించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, తుడా మాజీ చైర్మన్ ఎల్‌బి.ప్రభాకర్‌నాయుడు, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ మాలతి, ఈఓ మోతీ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

చంద్రగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో సర్పంచ్ రేవతి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీ వ్యాన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రజలకు వివరించారు. పాఠశాల విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఇన్సూరెన్స్‌పై వారికి అవగాహన కల్పించారు. ఎంపీడీఓ బాలాజీ నాయక్, కోఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, ఈఓపీఆర్డీ శశికళ, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ వైద్యులకు అవార్డులు

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఫిజియోథెరపీ విభాగం వైద్యులు ఇంటర్నేషనల్ కొలిక్వియం-2023 అవార్డులు అందుకున్నారు. చెన్నై శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో గత నెల 29, 30తేదీలలో రెండు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాల డాక్టర్లు పలు అంశాలపై ఇచ్చిన ప్రజంటేషన్లకు మొదటి, తృతీయ అవార్డులను అందుకున్నారు. అవార్డులు అందుకున్న అధ్యాపకులు డాక్టర్ కామేశ్వరి, రీసెర్చ్ స్కాలర్ ఎం.గోవింద నాయక్‌లను స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ శుక్రవారం ఆయన చాంబర్‌లో అభినందించారు.

జన సంక్షేమమే పరమావధి


మాట్లాడుతున్న కార్పొరేటర్ తూకివాకం శాలిని

తిరుపతి మంగళం: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా.. పేదల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో లేకపోతే తమ లాంటి లక్షలాది మంది పేదలకు జీవితమే లేదని తిరుపతి 15వ డివిజన్‌లోని మహిళలు ముక్తకంఠంతో తెలిపారు. 15వ డివిజన్ కార్పొరేటర్ తూకివాకం శాలిని, క్లస్టర్ ఇన్‌చార్జ్ పడమటి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. నిత్యం పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్నకు ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి తిరిగి గెలిపించుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని కార్పొరేటర్ శాలిని, క్లస్టర్ ఇన్‌చార్జ్ పడమటి కుమార్ తెలిపారు. తిరుపతిలో చరిత్రలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చేసిన చూపిన ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిలదని సగర్వంగా చెప్పారు. పార్టీ నాయకులు తూకివాకం మహి, శ్రీనివాసులు, ప్రేమ్‌కుమార్, రాజ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.